టీడీపీ ప్రభుత్వం రోడ్డున పడేస్తోంది

● ట్రంకు రోడ్డు విస్తరణపై దుకాణాల పరిరక్షణ సమితి నాయకులు ఆవేదన

ఒంగోలు సబర్బన్: నగరంలోని ట్రంకు రోడ్డు విస్తరణ పనులకు తాము అంగీకరించలేదని, కొందరు పనికట్టుకొని విస్తరణకు అంగీకరించామని ప్రచారం చేస్తున్నారని ట్రంకు రోడ్డు దుకాణాల పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. స్థానిక ట్రంకు రోడ్డులోని అంబిక లైఫ్ స్టైల్ పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం సమితి నాయకులు, సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత సమితి అధ్యక్షుడు కూరపాటి సత్యనారాయణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి నాయకులు మాట్లాడుతూ ట్రంకురోడ్డులోని దుకాణ యజమానులకు పదేపదే అన్యాయం జరుగుతోందన్నారు. 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ట్రంకు రోడ్డు విస్తరణ చేపట్టిందని, అప్పట్లో మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న యక్కల తులసీరావు అందరినీ ఒప్పించి ట్రంకు రోడ్డును 48 అడుగులు విస్తరణ చేశారని తెలిపారు. ఎలాంటి నష్టపరిహారం తీసుకోకుండా స్వచ్ఛందంగా తమ షాపులను సగానికిపైగా పోగొట్టుకున్నామన్నారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ ప్రభుత్వమే 100 అడుగులు రోడ్డు విస్తరించాలని చెప్పి నోటీసులివ్వడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పుడల్లా తమను రోడ్డున పడేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంకురోడ్డులో మొత్తం 240 దుకాణాలుండగా, ప్రస్తుతం 100 అడుగుల విస్తరణ అంటే.. వాటిలో 140 షాపులు పూర్తిగా లేకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ జరిగితే రుణాలు తీర్చలేక అప్పుల్లో మునిగిపోయి ఆత్మహత్యలే శరణ్యమవుతాయని గోడు వెళ్లబోసుకున్నారు. విలేకరుల సమావేశంలోనే పలువురు మహిళా వ్యాపారులు కన్నీటి పర్యంతమయ్యారు. సమితి సెక్రటరీ దేవతు వినోద్ కృష్ణారావు, వైస్ ప్రెసిడెంట్ చీమకుర్తి రఘురాం, ట్రెజరర్ గొల్ల శ్రీనివాసరావు, మహిళా వ్యాపారులు చీదెళ్ల నాగలక్ష్మి, పద్మజ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ట్రంకు రోడ్డు దుకాణాల పరిరక్షణ సమితి నాయకులు

మున్సిపల్ వర్కర్ల అర్ధనగ్న ప్రదర్శన



ఒంగోలులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

ఒంగోలు సబర్బన్: మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు ఏడు రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్మికులు స్థానిక ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం ముందు శనివారం ఏడో రోజు ధర్నా నిర్వహించారు. కార్మికులు, యూనియన్ నాయకులు వినూత్నంగా అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా చర్చి సెంటర్, ప్రకాశం భవన్ మీదుగా అంబేడ్కర్ భవన్ రోడ్డుకు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్‌కు కార్మికుల న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి బి.మహేష్, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, కే సామ్రాజ్యం, యు.కుమారి, జి.నరసింహ, ఆర్.శ్రీనివాసరావు, ఎం.బాబు, వై.రవి, ఏ అబ్రహం, డి.మేరీబాబు, కే పద్మ, కే శ్రీదేవి, శివమ్మ, కే జానయ్య, కే మోహన్‌రావు, లక్ష్మీప్రసన్న, వెంకట్రావు, రూతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో అంబేడ్కర్‌కు వినతిపత్రం...

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వారి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్లు చేస్తున్న సమ్మె శనివారంతో నాలుగోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాలేటి ఏడుకొండలు, పాటిబండ్ల పద్మ మాట్లాడుతూ జీఓ నంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని, తదితర సమస్యలతో కూడిన వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. తొలుత బస్టాండ్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సీఐటీయూ జెండాలతో ర్యాలీ నిర్వహించారు.

96 పనులకు రూ.13.35 కోట్లు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఒడా) ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో 96 పనులకుగానూ రూ.13.35 కోట్ల అంచనాలను ఆమోదించారు. స్థానిక సంతపేటలోని ఒడా కార్యాలయంలో శనివారం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్, వైస్ చైర్మన్ రోణంకి గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఒడా పరిధిలోని ఒంగోలు నగర పాలక సంస్థ, మార్కాపురం, అద్దంకి, చీరాల, కనిగిరి మున్సిపాలిటీలు, చీమకుర్తి, దర్శి, పొదిలి, గిద్దలూరు నగర పంచాయతీల నుంచి సమర్పించబడిన వివిధ అభివృద్ధి పనులను ఆమోదించారు. ప్రధానంగా మురుగు కాలువలు, వరద కాలువల నిర్మాణాలను ప్రతిపాదించినట్లు జేసీ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఓఎస్‌డీ యు.తరుణ భాస్కర్, ప్లానింగ్ విభాగం అధికారి కె.బాబూరావు, ఇంజినీరింగ్ విభాగం అధికారి టి.శ్రీనివాస సంజయ్, సెక్రటరీ ఆర్.చండీ దేవసేన, పరిపాలనాధికారి కె.వి.పద్మావతి, ఒడా సిబ్బంది పాల్గొన్నారు.





నేడు డీఈఈ సెట్ అభ్యర్థుల పత్రాల పరిశీలన

ఒంగోలు సిటీ: డీఈఈ సెట్ - 2025కు ఎంపికైన అభ్యర్థుల మార్కులు, ఇతర ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 20వ తేదీ పరిశీలించి సీట్లు కేటాయించనున్నట్లు మైనంపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు.

ఒప్పంద అధ్యాపకుల కొనసాగింపునకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో గత విద్యా సంవత్సరంలో ఒప్పంద పద్ధతిపై విధులు నిర్వర్తించిన అధ్యాపకుల సర్వీసును 2025-26 విద్యా సంవత్సరానికి పునరుద్ధరించేందుకు ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 693 మంది ఒప్పంద అధ్యాపకులకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందని చెప్పారు. ఏప్రిల్ 30, 2025 నాటికి విధుల్లో ఉన్న 60 సంవత్సరాల్లోపు వారు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అటానమస్ కాలేజీల్లో పనిచేసేందుకు పీహెచ్‌డీ/నెట్/స్లెట్ తప్పనిసరని తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

మద్దిపాడు: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకుందామని ఎంపీడీఓ జ్యోతి పిలుపునిచ్చారు. మండలంలోని వెల్లంపల్లి గ్రామ సచివాలయంలో ప్రజలు, సచివాలయ ఉద్యోగులతో శనివారం ఆమె మాట్లాడారు.

నేటి నుంచి ఎడ్ల బండలాగుడు పోటీలు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో పెద్దల సహకారంలో ఈ నెల 20వ తేదీ నుంచి సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. పాల్గొనదలచిన వారు ఎంట్రీ ఫీజు వెయ్యి రూపాయలను ఆదివారం ఉదయం 10 గంటల్లోగా చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. 10 క్వింటాళ్ల బండ ఉంటుందని, సేద్యపు విభాగం ఎడ్లు మాత్రమే పాల్గొనాలని వెల్లడించారు. మొదటి బహుమతిగా రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.25 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు, నాలుగో బహుమతిగా రూ.10 వేలు, ఐదో బహుమతిగా రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కమిటీ నిబంధనల మేరకే పోటీదారులు వ్యవహరించాలని చెప్పారు. పూర్తి వివరాలకు 9390062008, 9618815803 నంబర్లను సంప్రదించాలని సూచించారు.